క్లుప్తంగా

అష్టభుజ దుర్గమ్మకు 'ఆషాఢం' సారె



తెనాలి: పట్టణంలోని గంగానమ్మపేటలో చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీరామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణలోని అష్టభుజ దుర్గమ్మకు 'మన ఊరి సారె'ను సమర్పించారు. ఆషాఢ మాసం సందర్భంగా పుట్టి నింటి నుంచి సారె పంపటం సంప్రదాయం. ఆధ్యాత్మిక వేదిక శివ శక్తి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో 400 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. బోసు రోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి సన్నిధి నుంచి మహిళలు, కలశాలు, సారె పళ్లాలతో ఊరేగింపుగా గంగానమ్మ పేటలోని శ్రీరామేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన శివశక్తి సంస్థ వ్యవస్థాపకుడు సుగ్గున కరుణాకర్ నేతృత్వంలో అష్టభుజ దుర్గమ్మకు సారెను సమర్పించారు.

ఆళ్ల నాగేశ్వరరావుకు వైఎస్సార్ స్మారక పురస్కారం



తెనాలి: వైఎస్సార్ జీవితం – వ్యక్తిత్వం'పై ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో జరిగిన వచన కవితల పోటీల్లో పట్టణానికి చెందిన కవి, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావుకు వైఎస్సార్ స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. స్వర్గీయ డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన తెలుగు దినపత్రిక 'పున్నమి' నిర్వహించిన ఈ పోటీలకు 'చిరస్మరణీయుడు వైఎస్సార్' అనే కవితను పంపారు నాగేశ్వరరావు. ఉత్తమ తెలుగు వచన కవితను రాసి వైఎస్సార్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారంటూ పున్నమి సంపాదకుడు తనకు పురస్కార పత్రాన్ని పంపినట్టు ఆళ్ల ఆదివారం తెలియజేశారు. గుంటూరు-2 డిపోలో ఆర్టీసీ కండక్టరుగా చేస్తున్న నాగేశ్వరరావు, ప్రవృత్తిగా సాహితీ రచనలు చేస్తున్నారు. వివిధ అవార్డులను అందుకున్నారు.

స్కాలర్‌షిప్‌లు పంపిణీ



తెనాలిఅర్బన్: శ్రీకన్యకా పరమేశ్వరి వైశ్య విద్యానిధి కమిటీ ఆధ్వర్యంలో వివిధ తరగతుల్లో ప్రతిభ చూపుతున్న ఆర్యవైశ్య విద్యార్థినులు 51 మందికి రూ.10వేల చొప్పున మెరిట్ స్కాలర్ షిప్‌లను పంపిణీ చేశారు. బస్టాండ్ సమీపంలోని ఆర్యవైశ్య విద్యానిధి కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెండేల వెంకట్రావు, ప్రముఖ న్యాయవాది మద్ది మల్లికార్జునరావు, నాయకులు బచ్చు సాంబశివరావు, పెండేల సుబ్బారావు, తాతా శ్రీనివాసరావు, పెండేల చంద్రశేఖర్, తాళ్ళూరి సూర్యనారాయణ, దర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ



తెనాలిఅర్బన్: మేదరి సంఘం తెనాలి అధ్యక్షుడు జొరిగే నాగమోహన్ ఆధ్వర్యంలో మార్కెట్ సమీపంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం పేద మేదరి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గొడవర్తి శ్రీసాయి హరేరామ్, సంఘ కోశాధికారి నందికంటి హనుమాన్‌ప్రసాద్, నాయకులు కోడే నాగేశ్వరరావు, కోడే పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో సాలిపేటలోని విశ్వబ్రహ్మణ కళ్యాణ మండపంలో ఆదివారం పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్చక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గంటముక్కల అర్జున్, కడియం శేషు, కోశాధికారి తుమపాల లక్ష్మీప్రసాద్, జి సాయి, పి మణికంఠ పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: పేకాట ఆడుతున్న ఆరుగురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అమరావతి రోడ్డులోని ఆదిత్య లాడ్జి పెంట్ హౌస్‌లో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 27,130 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజీవ్ గృహకల్ప డ్రెయినేజీ..

కంపు కనవయ్యా కాంట్రాక్టరూ..!

- రాజీవ్ గృహకల్పలో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తం
- సెప్టిక్ ట్యాంక్‌లోకి వెళ్లాల్సిన వ్యర్థాలు డ్రైనేజ్‌లోకి..
- వర్షాలొస్తే..రెండింటి వ్యర్థాలు రోడ్లపై కొచ్చి దుర్గంధం
- సమస్య.. ఎమ్మెల్యే ద్వారా మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి..
- స్థానిక కౌన్సిలర్ల కృషితో నూతన డ్రైనేజీకి రూ.9.60లక్షలు విడుదల
- వర్క్ ఆర్డర్ తీసుకుని నెల దాటినా.. పత్తాలేని కాంట్రాక్టర్..



చంద్రబాబునాయుడు కాలనీలో రాజీవ్ గృహ కల్ప సముదాయాలు

తెనాలి అర్బన్: చంద్రబాబు నాయుడు కాలనీలోని రాజీవ్ గృహకల్ప సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఏడాది క్రితం డ్రెయినేజ్ పాడై మురుగుతో స్థానికులు సహవాసం చేస్తున్నా.. ఇప్పటి వరకు వారిని పట్టించుకున్న వారు లేరు. మారీసుపేట చంద్రబాబు నాయుడు కాలనీలో 2009లో రాజీవ్ గృహ కల్పను అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్మించారు. దానిని ఆయనే స్వయంగా ప్రారంభించారు. అక్కడ 13 బ్లాక్‌లలో సుమారు 425 అపార్ట్ మెంట్‌లను నిర్మించి పేదలకు ఇచ్చారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజ్, సెప్టిక్ ట్యాంక్, వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. కాలక్రమేణ సెప్టిక్ ట్యాంక్ నిండిపోవటం.. దానిని బాగు చేయించే వారు లేకపోవడంతో.. గృహకల్ప వాసులు పైపులను డ్రైనేజ్‌లో కలిపారు. దీంతో డ్రైనేజ్ వ్యవస్థలో వ్యర్థాలు చేరి, మురుగు అక్కడే నిలచిపోతూ వస్తోంది. చిన్నపాటి వర్షం పడితే మురుగుతో పాటు మలం కూడా రోడ్డుపైకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నిత్యం దుర్వాసన వస్తుండటంతో ప్రజలు 23, 24 వార్డుల కౌన్సిలర్లు తోక శిరీషా, పెదలంక లక్ష్మీలావణ్యకు తెలియజేశారు.



మురుగుకాల్వలో వ్యర్థాల తెట్టలు

కౌన్సిలర్ల చొరవతో రూ.9.60లక్షల నిధుల విడుదల

రాజీవ్ గృహకల్పలో సరైన డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేదని, నూతన డ్రైనేజీను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్‌ను కోరారు. ఎమ్మెల్యే సూచన మేరకు ఆమె రూ.9.60లక్షల నిధులను విడుదల చేసి, టెండర్లు పిలిచారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ వర్క్ ఆర్డర్ తీసుకుని నెల రోజులు దాటుతున్నా.. పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి వెంటనే నూతన డ్రైనేజ్, సెప్టిక్ ట్యాంక్‌లను ఏర్పాటు చేయాలని గృహకల్ప వాసులు కోరుతున్నారు.



మురుగులోనే ఉన్న మంచినీటి పంపు

ఏడాది నుంచి ఇబ్బందులు



రాజీవ్ గృహకల్పలో డ్రైనేజ్ వ్యవస్థ పాడై ఏడాది దాటుతోంది. దీనిపై అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేశాం. కానీ ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదు. ప్రతిరోజూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. –ధనలక్ష్మి, గృహకల్ప వాసి

సెప్టిక్ ట్యాంక్ నిండి ఏడాది దాటింది



రాజీవ్ గృహకల్పను నిర్మించినప్పుడు సెప్టిక్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. అది కొద్ది సంవత్సరాలకే నిండిపోయింది. అప్పటి నుంచి గృహకల్ప వాసులు సెప్టిక్ పైప్ లైన్‌ను డ్రైనేజ్‌లోకి కలిపారు. దీంతో డ్రైనేజ్ అంత వ్యర్థంతో నిండి ఇబ్బందికరంగా మారింది. –బేబి సరోజిని, గృహకల్పవాసి

కొత్త డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి..



రాజీవ్ గృహకల్పలో కొత్త డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్‌ను కోరిన మీదట వారు నిధులు విడుదల చేశారు. కానీ పనులు ప్రారంభించలేదు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి. –కౌన్సిలర్‌లు శిరీషా, లక్ష్మీలావణ్య

పనులు ప్రారంభిచేలా చర్యలు తీసుకుంటాం

రాజీవ్ గృహకల్పలో నూతన డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటుకు నిధులు కేటాయించాం. వర్క్ ఆర్డర్ కూడా ఇచ్చాం. వెంటనే సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. –ఎం.జశ్వంతరావు, కమిషనర్, తెనాలి మున్సిపాలిటీ

జీవితంలో ఎదగటానికి చదువే ఉత్తమ సాధనం

ఐఆర్‌ఎస్ అధికారిణి వి.కోటేశ్వరమ్మ



ఉత్తమ విద్యార్థిని సత్కరిస్తున్న కోటేశ్వరమ్మ, నల్లమోలు సుబ్రహ్మణ్యం

తెనాలి: జీవితంలో రాణించాలంటే చదువే ఉత్తమ సాధనమని ఐఆర్‌ఎస్ అధికారిణి వి.కోటేశ్వరమ్మ స్పష్టం చేశారు. అకడమిక్ విద్యతోపాటు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను చదవాలని సూచించారు. పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముత్యంశెట్టి పాలెంలోని పద్మశాలీయ కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఉత్తమ విద్యార్థులకు బంగారు పతకాలు, ఉపకార వేతనాలు, 209 మందికి నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. క్విజ్ పోటీల్లో మొదటి మూడు స్థానాలను సాధించిన గ్రూపులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను బహూకరించారు. సొసైటీ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు అధ్యక్షత వహించారు. మరో ముఖ్య అతిథి భారత ప్రభుత్వ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ మంత్రిత్వశాఖ జాయింట్ డైరెక్టర్ (సైంటిస్ట్–డి) నలుమోలు సుబ్రహ్మణ్యం (న్యూఢిల్లీ) మాట్లాడుతూ నిరుపేద కుటుంబ నుంచి వచ్చిన తాను, ఈ స్థాయికి రావటంలో పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ కృషి ఉందన్నారు. పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన కాటాబత్తుల నవ్యశ్రీ, చింపిరి, జక్కా యశ్వంత్ కుమార్‌ను బంగారు పతకాలతో సత్కరించారు. పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ ఫస్ట్ సాధించిన విద్యార్థులకు రూ.3 వేల నగదుతో మెడల్స్‌ను ఇచ్చి సన్మానించారు. గంజి ప్రభాకరరావు స్వాగతం పలికిన సభలో డాక్టర్ కటకం పురుషోత్తమరావు, కన్నా మాష్టారు, హరిప్రసాద్, అప్పారావు, రామకృష్ణ, దివి పురుషోత్తం, కటకం శేషగిరిరావు, భాస్కరరావు, ఓంకార్ ప్రసాద్, అక్కల శ్రీరామ్, జొన్నాదుల మహేష్, విద్యాసాగర్, శివశంకర్, పూర్ణచంద్రరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాలలకు నైతిక విలువలపై అవగాహన కల్పించండి

పాత గుంటూరు: బాలలకు నైతిక విలువలపై అవగాహన కల్పించేందుకు గురువులు కృషి చేయాలని సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు చెప్పారు. నగరంపాలెం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని శ్రీ సత్య సాయి బాలవికాస్‌లో ఆదివారం గురువులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు, విద్యార్థులకు నైతిక విలువల ప్రాముఖ్యత గురించి వివరించాలని తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 250 మంది గురువులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు కె.నారాయణరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. రీసోర్స్‌పర్సన్లు శిక్షణ ఇచ్చారు. పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్రబాల వికాస్ విభాగ సమన్వయకర్తలు వి.శకుంతల, టి.మధుసూదనరావు, జిల్లా సమన్వయకర్తలు ఆర్.మాధవి, పి.అప్పారావు, ఆదూరి హైమావతి, సీనియర్ ఫ్యాకల్టీలు, సభ్యులు పాల్గొన్నారు.

తెనాలిలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రారంభం

- తెనాలి శాఖ చైర్మన్‌గా డాక్టర్ కొలసాని రామ్‌చంద్
- 15 మందితో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



మానవత తెనాలి శాఖ బాధ్యుల ప్రమాణస్వీకారం

తెనాలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రారంభోత్సవం, నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెం పట్టణం కేంద్రంగా 2004లో 108 మంది సభ్యులతో ఆవిర్భవించిన ఈ సంస్థ, రాష్ట్ర వ్యాప్తంగా 95 మండలాల్లో 50 వేల సభ్యులతో విస్తరించి, 98వ శాఖ తెనాలిలో ఏర్పాటు చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి నేతృత్వంలో ప్రారంభోత్సవం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం కుమార్ పంప్స్ ఆవరణలోని సమావేశ మందిరంలో జరిగింది. తెనాలి శాఖ చైర్మన్‌గా ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, కో–చైర్మన్‌గా ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శారద, డెరెక్టర్లుగా వజ్రాల రామలింగాచారి, కటకం ప్రసాద్, డీవీ సోమయ్యశాస్త్రి, ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షురాలిగా కళ్యాణి, కార్యదర్శిగా తన్నీరు శ్రీనివాసబాబు, కోశాధికారిగా పాపోలు వెంకటేశ్వరరావు, సభ్యులుగా శర్మ, రాఘవరెడ్డి, ధనుంజయరావు, రాజేశ్వరి, సలహా బోర్డు సభ్యులుగా ఘట్టమనేని నాగేశ్వరరావు, వెంపటి సత్యనారాయణచే గుంటూరు శాఖ చైర్మన్ పావులూరి రమేష్ ప్రమాణం చేయించారు.

ప్రారంభ సభలో సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి ఉపనిషత్తులు, వాటికి ఆదిశంకరాచార్యుల భాష్యాలను ఉటంకిస్తూ ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడారు. తెనాలిలో మానవత సంస్థ ఆవిర్భవించటం సంతోషంగా ఉందన్నారు. రీజనల్ చైర్మన్ కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తెనాలిని మానవతా విలువలున్న పట్టణంగా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. శారద సర్వీసెస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద తన ప్రసంగంలో సంస్థ ఆశయాలు ఉన్నతమని చెప్పారు. సంస్థ రాష్ట్ర కన్వీనర్లు రామాంజనేయులు రెడ్డి, జానకిరామిరెడ్డి తమ ప్రసంగాల్లో సంస్థ కార్యకలాపాలను వివరించారు. పావులూరి ట్రస్ట్ వ్యవస్థాపకుడు పావులూరి శ్రీనివాసరావు, తొలుత గాయకుడు వెంపటి సత్యనారాయణ ఘంటసాల పాటలను గానం చేశారు. ఉప్పల సాంబశివరావు స్వాగతం పలికారు.

కల్యాణ మండపానికి నిధులు మంజూరు



ఎంపీ బాలశౌరికి వినతిపత్రం అందజేస్తున్న చక్రాయపాలెం గ్రామస్తులు

పట్నంబజారు: కొల్లిపర మండలంలోని చక్రాయపాలెంలో కల్యాణ మండప నిర్మాణానికి మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి నిధులు మంజూరు చేశారు. కల్యాణ మండపం నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు గుంటూరు కృష్ణ నగర్‌లోని ఎంపీ నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. కల్యాణ మండపం నిర్మాణం నిధుల కొరత కారణంగా నిలిచి పోయిందని ఎంపీ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ. 31 లక్షలు ఎంపీ నిధులు మంజూరు చేయించారు. గ్రానైట్ వేయడానికి రూ. 9లక్షలు కలిపి మొత్తం రూ. 40 లక్షలు అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో చక్రాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ చందు నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ, బూరెల దుర్గాప్రసాద్, అత్తోట మండల నాయకులు కఠారి ప్రసాద్, పసుపులేటి రమేష్, చందు కోటయ్య, చందు హరిబాబు, ఆలా శ్రీనివాసరావు, పోకల సాంబశివరావు, రెడ్రౌతు వెంకట సాంబయ్య, పసుపులేటి శివన్నారాయణ, పరుచూరి శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు వ్యాపార అవకాశాలపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న సుజాతారెడ్డి, యామిని శర్మ, ఎస్‌బీఐ ఏజీఎం తదితరులు

గుంటూరు మెడికల్: స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో ఆదివారం అరండల్‌పేటలోని వావిలాల సంస్థ కార్యాలయంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన 62 మంది మహిళలు పాల్గొన్నారు. ఫ్యాషన్ వింగ్స్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ యజమాని పి.సుజాతారెడ్డి వ్యాపార అవకాశాలు, ఎంబ్రాయిడింగ్ మెలకువలపై అవగాహన కల్పించారు. బ్యాంకింగ్ సేవలు, ముద్ర రుణాల్ని పొందే విధానం గురించి ఎస్‌బీఐ ఏజీఎం వి.శ్రీనివాసరావు వివరించారు. హరి గార్మెంట్స్ యజమాని డి.హరి వ్యాపారం, మార్కెట్లో మెలకువలను తెలియజేశారు. స్వావలంబి భారత్ అభియాన్ సంస్థ లక్ష్యాలు, చేసిన పనులు, భవిష్యత్ కార్యాచరణ గురించి కాకాని పద్వీరాజ్ వివరించారు. కుటుంబాన్ని, వ్యాపారాన్ని సమన్వయం చేసుకునే విధానాన్ని యామిని శర్మ తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కన్వీనర్ ఈ.కోటేశ్వరరావు, మల్లాది రవి, గుంటూరు జిల్లా విభాగ ప్రముఖ్ పి.రవిశంకర్, మల్లికార్జునరావు, రాజేశ్వరి, శైలజ, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాంకరీమాతకు ఆషాఢ సారె

గుంటూరు రూరల్: మండలంలోని లాలుపురం గ్రామం శాంకరీమాత నామంతో పులకరించిపోయింది. ఆదివారం శాంకరీ మాతకు జై అంటూ మహిళలు గ్రామ పురవీధుల్లో ఊరేగింపు ఘనంగా జరిపారు. అమ్మవారికి పాటిమీద మహిళా భక్తులు సామూహికంగా ఆషాఢమాసం సారెను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ వస్త్రాలు ధరించి రకరకాల పూలు, గాజులు, స్వీట్లు, చలిమిడి, పసుపు కుంకుమలను చేత పట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. మేళతాళాలు, టపాసులు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకారాన్ని నిర్వహించారు. అమ్మవారికి కలువ పూలతో అలంకరించిన దండ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

యూసీసీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ



వెస్ట్ ప్యారిస్ చర్చి వద్ద సంతకాల సేకరణ

నెహ్రూనగర్: ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్(ఐక్య) ఆధ్వర్యంలో యూనిఫైడ్ సివిల్ కోడ్(యూసీసీ)కి వ్యతిరేకంగా ఆదివారం నగరంలోని పలు చర్చిల వద్ద సంతకాల్ని సేకరించారు. ఈ సందర్భంగా ఐక్య వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు మాట్లాడతూ భారత పౌరుల్ని ప్రమాదంలో పడేసే యూసీసీ అమలుకు తాము వ్యతిరేకమన్నారు. యూసీసీ ఏర్పాటు చేయడమంటే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కించపరచడమేనని తెలిపారు. రాజ్యాంగంలోని సెక్యులర్ వ్యవస్థ, సమానత్వానికి సంబంధించిన పలు అధికరణాల్ని తీసివేసే అవకాశముందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మార్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు. సంతకాల సేకరణ సోమవారం సాయంత్రం వరకు ఉంటుందని, వాటిని ఢిల్లీలోని భారత లా కమిషన్‌కు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గాబ్రియేల్, మద్దు ప్రేమజ్యోతిబాబు, కందుల దీనమణిరాజు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి నిధులు మంజూరు



ఎంపీ బాలశౌరికి వినతి పత్రం అందజేస్తున్న చక్రాయపాలెం గ్రామస్తులు

పట్నంబజారు: కొల్లిపర మండలంలోని చక్రాయపాలెంలో కల్యాణ మండప నిర్మాణానికి మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి నిధులు మంజూరు చేశారు. కల్యాణ మండపం నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు గుంటూరు కృష్ణనగర్‌లోని ఎంపీ నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. కల్యాణ మండపం నిధుల కొరత కారణంగా నిలిచిపోయిందని ఎంపీ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ. 31 లక్షలు ఎంపీ నిధులు మంజూరు చేయించారు. గ్రానైట్ వేయడానికి రూ. 9లక్షలు కలిపి మొత్తం రూ. 40 లక్షలు అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో చక్రాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ చందు నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ, బూరెల దుర్గాప్రసాద్, అత్తోట మండల నాయకులు కఠారి ప్రసాద్, పసుపులేటి రమేష్, చందు కోటయ్య, చందు హరిబాబు, ఆలా శ్రీనివాసరావు, పోకల సాంబశివరావు, రెడ్రౌతు వెంకట సాంబయ్య, పసుపులేటి శివన్నారాయణ, పరుచూరి శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అలరించిన అన్నమాచార్య సంకీర్తన విభావరి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై శ్రీ సాయి సంగీత కళా నిలయం శిష్య బృందం అన్నమాచార్య సంకీర్తనల్ని శ్రావ్యంగా ఆలపించింది. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నమో గణపతే, వచ్చెను అలమేలు మంగ, శ్రీ వేంకట రమణుడు మా స్వామి, కొండలలో కొలువైన శ్రీనివాసుడా అంటూ పలు సంకీర్తనల్ని గాయకులు ఆలపించారు. వీరికి హరిబాబు, వెంకట వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమాన్ని తిన్నలూరి హరిబాబు నిర్వహించారు.

విత్తన సత్తువ తెలుసుకుంటేనే కొనుగోలు..

- విత్తనాలు, పురుగు మందుల కోనుగోలు రశీదులు తప్పనిసరి
- అనుమతి పొందిన దుకాణాల్లో కొనుగోలు చేయాలి
- పంట నష్టపోతే పరిహారం పొందే అవకాశం
- ఏఓ వెంకటరావు



గత తనిఖీల్లో నకిలీ విత్తనాలను గుర్తించిన ఏఓ..

కొల్లిపర: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. దుక్కులు దున్నడం, వరి విత్తనాలు గొర్రులతో పెట్టడం, ఎరువులు తోలడంలో నిమగ్నమయ్యారు. వాతావరణం పూర్తిస్థాయిలో అనుకూలించి, వర్షాలు పడటంతో సాగుకు శ్రీకారం చుట్టారు. కొల్లిపర మండలంలో వరి, పసుపు, కూరగాయల పంటలపైనే రైతులు దృష్టి సారించారు. వ్యవసాయశాఖ అందించే రాయితీ విత్తనాలనే కాక ప్రైవేట్ దుకాణాల నుంచి విత్తన కొనుగోళ్లు చేస్తున్నారు.

మోసపోతే భారీ నష్టమే

నకిలీ విత్తనాల భారిన పడి రైతులు ఏటా అధికంగా నష్టపోతున్నారు. నకిలీ విత్తనాలను ముందే గుర్తించకపోతే నష్టపోక తప్పదని వ్యవసాయ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. తగు జాగ్రత్తలు తీసుకుంటే నష్టపోయిన వారు కూడా సంబంధిత కంపెనీల నుంచి పరిహారం పొందవచ్చని చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

- వ్యవసాయశాఖ ద్వారా అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- కొన్ని చోట్ల ప్రభుత్వ అనుమతి లేని అనధికార విత్తన వ్యాపారాలు తెల్ల సంచుల్లో నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉన్నందున వారి సమాచారాన్ని తక్షణమే అధికారులకు తెలియజేయాలి.
- ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు కొనుగోలు చేయాలి.
- కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి.
- బిల్లులపై రైతు చిరునామా, గడువు తేదీ, విత్తన ధర, కంపెనీ పేరు, అమ్మిన వారి సంతకం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త పడాలి.
- విత్తన బస్తాపై ముద్రించిన ధృవపత్రం బిల్లును పంట చేతికి వచ్చే వరకూ భద్రపరుచుకోవాలి.
- విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరిక్షించుకోవాలి. కనీసం మొలక 75 శాతం ఉంటేనే విత్తనంగా వినియోగించుకోవాలి.
- విత్తన సంచులను రైతులు నమూనా వివరాల కోసం పంట కోతకు వచ్చే వరకూ దాచుకోవాలి.

పరిహారం పొందొచ్చు..



నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధికారులు, పోలీసులకు సంబంధిత రశీదుతో ఫిర్యాదు చేయవచ్చు. విత్తన నాణ్యత ప్రమాణాల కన్నా తక్కువ మొలక శాతం నుంచి దిగుబడి ప్రభావితం చేసినట్లు భావిస్తే ఆ కంపెనీపై జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేయవచ్చు. పరిహారం పొందడానికి బిల్లులు భద్రపరుచుకోవాలి. దీంతో రైతులు నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై ఫిర్యాదు చేయవచ్చు.

– ఏఓ కె.వెంకటరావు, కొల్లిపర మండలం.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు పుస్తకాలు, ప్రోత్సాహకాలను అందజేస్తున్న రజక సంఘ నాయకులు

నెహ్రూనగర్: విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని రజక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మానేపల్లి దుర్గారావు పేర్కొన్నారు. బీఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న గంగానమ్మ గుడి ఆవరణలో ఆదివారం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన రజక విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు బ్యాగులు, బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలంటే చదువు ఒక్కటే మార్గమని చెప్పారు. దాన్ని ప్రధాన ఆయుధంగా మలుచుకుని అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెలివేటి నాగేశ్వరరావు, మురళి, సాంబశివరావు, రాంబాబు, భగత్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.